

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**నిన్న స్కీయింగ్ చేసిన** దాని ప్రభావం ఇవాళ పొద్దున తెలిసింది. నిజానికి మధ్య రాత్రినుండి తెలిసింది అనాలి. చిన్నప్పుడు మా అమ్మమ్మ చెప్పిన కాళ్ళనొప్పులు, కీళ్ళ నొప్పులు అంటే ఏంటో అర్థమైంది. నొప్పితో మెలకువ రావడం నా జీవితంలో ఇదే మొదటిసారి. అన్నయ్య కూడా ఇదే పరిస్థితిలో ఉన్నాడేమో అని తలుపు ఓరగా తెరిచి తొంగి చూసాను. సుబ్బరంగా నిద్రపోతున్నాడు. తోచక అమ్మకి ఫోన్ చేసాను.

ఎలా ఉన్నావు బంగారం?"

"బానే ఉన్నాను. నువ్వూ, నాన్న ఎలా ఉన్నారు?"

ఇక్కడ అంతా బాగానే ఉంది. అన్నయ్య ఏం చేస్తున్నాడు?"

"ఇంకా లేవలేదు. అమ్మమ్మకి కాళ్ళ నొప్పులు, కీళ్ళ నొప్పులు తగ్గాయా?"

"వృద్ధాప్యం కదా, ఇంకేం తగ్గుతుంది పాపం."

"వృద్ధాప్యం కాకపోతే ఎలా తగ్గుతుంది?"

"వృద్ధాప్యం వల్లే వస్తాయి అవి. పాపం ఎముకలు అరిగిపోయి, పోషణలేక" అమ్మకంఠంలో దుఃఖం వినపడింది. "అందుకే మిమ్మల్ని పాలు తాగరా? సరిగ్గా భోంచేసారా అని ఈ రోజుకీ అడుగుతుంటాను" అమ్మని దుఃఖం నుండి బయటకి తెచ్చేందుకు ప్రయత్నంగా నిన్నటి స్కీయింగ్ గురించి చెప్పను.

"అబ్బో, బాగానే వెళ్ళావ్. భయమేసిందా?"

"మొదట్లో చాలా భయమేసింది. అన్నయ్యతో వెనక్కి వెళ్ళిపోదాం అని చెప్పాలనుకున్నాను. కానీ జీవితాంతం అదే పట్టుకుని చులకన చేస్తా్డని అనలేదు"

"అయ్యో. అన్నయ్యే కదా. నీకు రేపేదైనా అవసరం వస్తే చూసుకునేదివాడే. అలా మొహమాటపడకమ్మా"

"మొహమాటమా నా బొందా? వాడి విసిగింపుకన్నా ధైర్యం చేయడం నయం"

"తప్పు. అన్నయ్యని అలా వాడూ, వీడూ అనకూడదు."

"నన్ను మాత్రం 'ఒసేయ్' అనొచ్చా" తెలీకుండానే గట్టిగా మాట్లాడాననుకుంటా.

అన్నయ్య లేచి వచ్చాడు "ఎవరితో మాట్లాడుతున్నావు?" అడిగాడు.

"అమ్మతో" కోపంగా చెప్పాను.

పెద్దగా నవ్వి ఫోన్ స్పీకర్‌లో పెట్టాడు.

"ఇది మళ్ళీ విసిగిస్తుందా?" అడిగాడు.

"లేదులే పాపం. ఏదో కబుర్లు చెబుతుంది" అమ్మ బదులిచ్చింది.

"నన్ను 'ఇది' అంటే మాత్రం తప్పు అనరే" కోప్పడ్డాను.

"పెద్దవాడుకదా" అమ్మ జవాబు పక్కనుండి అన్నయ్య నాలుక బయటపెట్టి వెక్కిరించాడు.

"అయితే మాత్రం? ఇది పార్షియాలిటీ."

"తల్లికి అందరూ సమానమే" అన్నయ్య మళ్ళీ వెక్కిరించాడు.

"నువ్వు అలా అంటావు. అంతే కానీ పాటించవు" కోపంగా అన్నాను.

"ఇంతకీ గొడవ దేనిగురించి?" అన్నయ్య సంభాషణ మార్చేందుకు అడిగాడు.

"నిన్నటి స్కీయింగ్ గురించి చెబుతుంది రా, భయంగా అనిపించినా నువ్వు ఏమనుకుంటావో అని ధైర్యం చేసిందట" అమ్మ అంది.

"ఏం అనుకుంటాడో అని కాదు. సతాయిస్తాడని" సరిచేసాను.

"ఆ స్కీయింగ్ కే భయమేసిందా?" అన్నయ్య పెద్దగా నవ్వాడు.

"అంతలేదులే. నువ్వు నవ్వక్కర్లేదు" చిన్న బోయాను.

"బానే చేసావులే. మొదటిసారైనా ఏదో ఇంతకు ముందు చేసినట్టే ధైర్యంగా చేసావు. కింద పడినా బానే నవ్వుతూ మళ్ళీ లేచావు" అన్నయ్య అన్నాడు.

"కింద పడిందా? అయ్యో పాపం దెబ్బలు తగిలాయా? అందుకేనా కాళ్ళ నొప్పులు గురించి అడిగావు?" అమ్మ అంది.

అన్నయ్య పెద్దగా నవ్వాడు.

"బాడీ పెయిన్స్ ఉన్నాయా?" అడిగాడు.

"ఏం లేవు. అమ్మమ్మ ఆరోగ్యం గురించి అడిగాను అంతే" బదులిచ్చాను.'

"నేనైతే రెండురోజులు మంచం దిగలేదు. నీకన్నా చాలాసార్లు కింద పడ్డాను. భయపడలేదు కానీ మరీ అంత కాన్ఫిడెంట్‌గా కూడా లేను" అన్నయ్య అన్నాడు.

"నిజంగానా?" ఆశ్చర్యపోయాను.

"ఔనే. నువు బానే ధైర్యంగా వెళ్ళిపోయావు. అంత ఇబ్బందిపడినట్టు అనిపించలేదు. ఇప్పుడు వళ్ళు నెప్పులు ఉన్నాయా?" అడిగాడు.

"కొంచెం కాళ్ళు నెప్పులు కానీ మరీ అంతేం కాదులే" బదులిచ్చాను.

"చెల్లాయ్‌ని జాగ్రత్తగా చూసుకోరా" అమ్మ అంది.

"నాపై నమ్మకం లేదా?" అన్నయ్య అడిగాడు.

"నీపై కాకపోతే ఎవరిపైన ఉంటుంది?" అమ్మ అడిగింది.

"ఆపుతారా మీ అంజలీదేవి, నాగేశ్వరరావు డ్రామా?" అడిగాను.

"కుళ్ళు దీనికి" అన్నయ్య అన్నాడు.

"రేపు మాట్లాడదాంలే" అమ్మ అంది.

"అంతే మీ అబ్బాయికి వ్యతిరేకం కాబట్టి రేపు మాట్లాడతావు" అన్నాను.

"అలా అంటావేంటి బంగారం? మీ ఇద్దరూ నాకు ఒకటే. ఈ కన్ను ఎక్కువా? ఆ కన్ను ఎక్కువా? అంటే ఏం జవాబు చెబుతాను?" అమ్మ దీనంగాఅడిగింది.

"అలా అనలేదు నేను" అన్నాను.

"రేపు మాట్లాడదాంలే" అన్నయ్య అన్నాడు.

"సరే అయితే రేపు మాట్లాడండి" అమ్మ అంది.

"సరే. బై" నేను, అనయ్య అన్నాము.

"కొట్టుకో బాకండి" అమ్మ అంది.

"బాకములే" నేను, అన్నయ్య అన్నాము. తరవాత ఫోన్ పెట్టేసాము.

"ఇవ్వాళ ఏం చేద్దాం?" అన్నయ్య అడిగాడు.

"నీ ఇష్టం. నిజానికి నువ్వు వంట చేసి, పెయిన్ కిల్లర్ ఇస్తే నేను నిద్రపోతాను" అందాం అనుకున్నాను.

"బయట తిందామా? ఇంట్లోనా?"

బయట అంటే మళ్ళీ తయారవ్వాలి కాబట్టి "ఇంట్లో తిందాం" అన్నాను.

ఆశ్చర్యంగా చూసి "ఎందుకు?" అన్నాడు.

"ఎందుకు ఏంటి? బయట ఖర్చు ఎక్కువ" అన్నాను.

"ఓ నేను ఇంకా ఏదైనా వండుతావేమో అనుకున్నాను" అన్నాడు.

"నేను టీవీ చూస్తుంటా. నువ్వే వండు ఇవాళ" మూతి తిప్పాను.

అన్నయ్యకి నా బాధ అర్ధమైందనుకుంటాను "సరే నీకు అదిరిపోయే మునగాకు పప్పు చేసిపెడతా" అన్నాడు.

"సరే" అన్నాను .మామూలు రోజుల్లో వెటకారం చేసేదాన్ని. నా స్నానం, సంధ్య పూర్తయ్యేసరికి, అన్నయ్య ఓట్‌మీల్ ఇంకా ఒక టైనెనాల్ ఇచ్చాడు.

"అది తిని, ఇది వేసుకో బావుంటుంది" అన్నాడు.

"బావుండడానికి నువ్వు ఇచ్చింది ఐస్క్రీం కాదు. మందు" వెక్కిరించాను.

"ఇదే ఐస్క్రీం అనుకో" అమ్మలానే చెప్పాడు.

నేను మందు వేసుకున్న అరగంటకి నెప్పులు కాస్త తగ్గాయి.

తరవాత నేను, అన్నయ్యకి సహాయం చేసాను. రాత్రి మిగిలిన భోజనం ముందు తిందాం అని చెప్పాను.

"ఎందుకూ? వేడి వేడి అన్నం ఉందిగా" అన్నయ్య అన్నాడు.

"అది వేస్ట్ అయిపోతుంది" అన్నాను.

"నువ్వు అచ్చు అమ్మలా మాట్లాడతున్నావు" అన్నయ్య అన్నాడు.

తెలియకుండానే మేమిద్దరం మా అమ్మలా మాట్లాడుతూ, ఒకరిని ఒకరం అమ్మలా చూసుకుంటున్నామని నాకు అర్థమైంది. చిన్నగా నవ్వాను.

మరో జంధ్యాల నవ్వించే సినిమా చూస్తూ, తింటూ,మధ్యాహ్నం పూర్తి చేసాము.

Click here to share your comments on this story